
# ముందు చూపు




**పి.యస్.నారాయణ**

“నాపేరు శారద. నేను ఎస్సెల్సీ రెండు సంవత్సరాల క్రితం పాసయ్యాను. టైపు నిముషానికి నలభై మాటలు కొట్టగలను. షార్టుహ్యాండు ఎనభై స్పీడు వున్నది. హైయ్యరుకు ఇంకా వెళ్ళటానికి ప్రయత్నించటంలేదు. మా నాన్నగారు సంవత్సరం పట్టి పక్షవాతంతో బాధపడుతూ మంచంలోవున్నారు. మా అమ్మ గుండె జబ్బు మనిషి. వాళ్ళను పోషించేందుకు నేను తప్ప మరెవ్వరూ లేరు. దురదృష్టవశాత్తు అనుకోకుండా ఎస్సెల్సీ చదువుతున్న మా తమ్ముడు కారు ప్రమాదంలో మరణించాడు. ఇంతకు మునుపెన్నడూ నేనే ఉద్యోగమూ చేయలేదు...నెలకు నూట పాతికయితే మా సంసారానికి కటాబిటీగా సరిపోతుంది.”

ఆరోజే ఉద్యోగంలో చేరిన శారద విశ్రాంతిగా కూర్చొని వారంరోజుల క్రితం తను ఆ ఉద్యోగం కోసరం ఇంటర్వ్యూకు వచ్చినపుడు మేనేజర్ అడిగిన ప్రశ్నలకు తన సమాధానాల సమగ్ర స్వరూపాన్ని నెమరు వేసుకోసాగింది.

తన గాథ ఎవరికి జాలివేయదు?

అంతవరకు, ఎన్నడూ ఇంటర్వ్యూ అంటే అనుభవంలేని తను, పరిస్థితుల ప్రభావంతో ఈ ఇంటర్వ్యూకు వెళుతూ ఎంతో బాధపడింది. భయపడింది. సిగ్గుతో కుంచించుకుపోయింది. ఆ సమయంలో తన మొఖం, దీనత్వానికి ప్రతిబింబంగా వున్నది. బహుశః ఆ సమయంలోని ఆ తన మొఖాన్ని చూచే ఈ ఉద్యోగానికి తనని ఎన్నుకొని వుండవచ్చు!

మేనేజర్ గదిముందు బజ్జర్ 'గుర్రు' మంది. బయట స్టూలు మీద కూర్చున్న ప్యూను, ఎంయిర్ కండిషన్డ్ గది తలుపు లోపల కాలుపెట్టి అడుగు వేయబోయాడు.

“స్టెనో...!” మేనేజరు గొంతు వినబడింది. శారద షార్టుహ్యాండ్ పుస్తకమూ పెన్సిలూ తీసుకొని తడబడుతూ లేచి నిలబడింది.

ఆరోజు సాయంత్రం ఐదుగంటలకు మేనేజర్ వెళ్ళిపోయిన తరువాత శారద రోడ్డు మీదకు వచ్చి ఇంటికి వెళ్ళేటందుకుగాను సిటీబస్సు ఎక్కింది.

తన ఇంటి గడపలో కాలు పెడుతుండగా, అనాలోచితంగా ఒక్కసారి తలఎత్తి పక్క మేడ మీదకు చూచింది.

వరండాలో సాంబమూర్తి— యాభై ఏండ్ల సాంబమూర్తి తన వైపే జాలిగా చూస్తూ కూర్చొని వున్నాడు. అతడి నున్నటి బట్టతల మీద అన్నీ వూడిపోగా, ఇక చేతగాని తనమే మిగిలినట్లుగా వున్న సన్నటి వెంట్రుకల పాయను వేలితో అటూ యిటూ కదిలిస్తున్నాడు. అతడి కళ్ళు లోతుగా, దేన్నో తరచి తరచి చూస్తున్నట్లుగా తనవంకే చూస్తున్నయి. ఆయన అరుగురు పిల్లలకు తండ్రి అన్నట్లుగా వున్న ముఖం మీది ముడతలను చూచి గిరుక్కున శారద లోపలికి వచ్చేసింది.

పక్షవాతంతో బాధపడుతూ, అశక్తుడయి కిటికీ పక్కగా నులకమంచం మీద పడుకొని వున్న తండ్రి కళ్ళల్లోకి ఒక్కసారి దీనంగా, జాలిగా చూచి లోపల కాలు పెట్టింది.

తరువాత పదినిముషాలకు, గుండెజబ్బుతో బాధపడే తల్లికి దాపుగా కూర్చొని, ఆరోజు ఆఫీసు విషయాలు ఆనందంగా చెబుతున్నప్పుడు, తల్లికి అమితమైన జాలి కలిగింది. వేదన అనుభవించింది.

“చిట్టితల్లి!” అని శారద తలను తన బలహీనమైన గుండె మీద బలంగా హత్తుకున్నది.

ఆమె కళ్ళు అశ్రుధారలతో నిండిపోయినవి.

“నీవు ఒక యింటిదానివై పండంటి పసిపాపలతో నవ్వుతూ, నవ్విస్తూ తిరుగుతూ వుండగా చూచి సంతోషించవల్సిన నేను..” ఆ తరువాత ఆమెకు నోట మాట పెగల్లేదు.

శారద చివ్వున లేచి నిలబడుతూ, “ఇక నీ సోది మొదలు...!” అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

ఆర్ధ్రాత్రి శారద మంచం మీద పడుకొని వున్నదన్న మాటేగాని ఆమె మనస్సు మనస్సులో లేదు. తననూ, తన జీవితం మీద భయాలతో గూడిన భావాలతోనూ, వింత వింత ఆలోచనలతోనూ, వూహల్లో తేలిపోతూ కాలం గడిపింది.

అప్పుడప్పుడూ, అతినెమ్మదిగా, సుస్మితంగా నవ్వే కళ్ళతో మాట్లాడే తన ఆఫీసు మేనేజర్ గుర్తుకు రాగా మనిషి కలవరపడసాగింది.

ఏది ఏమైనా తన జీవితం ఒక ఒడ్డుకు చేరినట్లే అనిపిస్తోంది!

తమ కుటుంబాన్ని ఇక ఏ కష్టాలూ లేకుండా దొర్లించవచ్చు.

తన వివాహం?

ఆవూహ రాగానే—మనిషి ఆవిర్లలో తేలిపోసాగింది. ఉక్కిరిబిక్కిరి అయింది. అనుభూతులతోనూ, ఆవేదనతోనూ గిరగిర తిరిగిపోసాగింది.

తనకు వివాహమైతే—తను భర్త దగ్గరకు వెళ్ళిపోతే—ఏ ఆధారములేని తన తల్లిదండ్రులను పక్షవాతంతో బాధపడే తండ్రిని, గుండెజబ్బు తల్లిని ఎవరు ఆదుకుంటారు? ఎవరు పోషిస్తారు?

ఒక్కక్షణం శూన్యంలోకి చూచి, “దానికి ఒక్కటే సమాధానం— తను వివాహం చేసుకోగూడదు!” అనుకున్నది. దృఢనిశ్చయానికి వచ్చినట్లు పిడికిలి బిగుసుకుపోయింది.

మరుక్షణంలోనే నాలుగురోజుల క్రితం తనను చూడటానికి వచ్చిన గుంటూరు వాళ్ళతో ఆమె ధైర్యం చేసి చెప్పిన మాటలు గుర్తుకొచ్చినయి.

"నేను ఉద్యోగ ప్రయత్నంలో వున్నాను. ఉద్యోగం ఎప్పుడు దొరికినా దొరకకపోయినా ఆ ప్రయత్నంలోనే వుంటాను. వివాహం అయిన తరువాత గూడా నేను ఉద్యోగం చేయక తప్పదు. జీతంలో ఎక్కువ భాగం నా తల్లిదండ్రుల సంరక్షణకు పంపవలసి వుంటుంది.. అందుకు అంగీకారమయితేనే ఈ వివాహం జరుగుతుంది!"

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత తల్లి తండ్రి తిట్టారు తనను.

కాని వాళ్ళ ముందు జీవితం?

ఉహూ..

వాళ్ళ బాధ వాళ్ళు పడతామంటారు!

ఏం పడతారు?

వాళ్ళు వెళుతూ వెళుతూ, "మధ్యవర్తి ద్వారా కబురు చేస్తాం!" అన్నారు. ఆ వార్త రెండుమూడు రోజులలోనే అందవచ్చు!

అదేమిటో గూడా తనకు తెలుసు!

తన కోరికను అంగీకరించే విశాలహృదయం వాళ్ళకుండదనే తన నమ్మకం!

తరువాత ఒక్కక్షణం—

తన జీవితం ఏదో తెలియని లోయలో, అంతులేని అగాధంలో కూరుకుపోతున్నదేమోననిపిస్తోంది.

కాని అందులో తనకు తృప్తే ఎక్కువ కనబడుతోంది!

తనను కని, పెంచి, పెద్దజేసిన తల్లిదండ్రులకు తను అంతకన్నా చేయగలిగిందేవున్నది?

మరుక్షణంలోనే ఎదురింటి సాంబమూర్తి కనబడ్డాడు.

ఎదురుగ్గా నిలబడ్డాడు—తన యాభై ఏళ్ళ వయస్సును నవ్వు వెనుక ఇరికించుకొని, జాలితో కప్పుకొని ఆశను తన మీద విరజిమ్ముతూ!

తీక్షణంగా చూచింది అతడి కళ్ళల్లోకి—దేన్నో తరచితరచి చూస్తున్నట్లుగా వున్న లోతుకుపోయిన కళ్ళల్లోకి. అతడి నున్నటి బట్టతల మీద—అన్నీ వూడిపోగా, ఇక చేతగానితనమే మిగిలి వున్నట్లుగా వున్న సన్నని వెంట్రుకల పాయను అప్పుడప్పుడు తన హృదయాన్ని భయంకరంగా కదిలిస్తున్నట్లుగా కదిలిస్తున్నాడు. ఆయన ఆరుగురు పిల్లలకు తండ్రి అన్నట్లుగా వున్న ఆయన మొఖం మీది ముడతలు తన చుట్టూ ఏదో భయంకరమైన వలను పన్నేస్తున్న తాళ్ళలాగా క్రూరంగా చూస్తున్నయి.

ఒకనాడు వచ్చి, ఆయన భార్య మరణించిన కొద్ది రోజులకే, తన తండ్రిని అడిగాడు—తనను ఇచ్చి వివాహం చేయమని! ఈ ముసలి వయస్సులో అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిదండ్రులకు ఎంతో ఆసరాగా వుంటానన్నాడు. తను గూడా, ఎప్పుడూ వాళ్ళకు ఎంతో సహాయకారిగా వుండగలుగుతుందన్నాడు.

తన తండ్రి నానా చివాట్లు పెట్టాడు. ఇంకెప్పుడూ అలాంటి పిచ్చి పిచ్చి కోరికలు కోరవద్దన్నాడు. నా పిల్లకు నా చేతగానితనంవల్ల అలాంటి వివాహమే చేయవలసి వస్తే, అసలు వివాహమే చేయనన్నాడు!

ఆక్షణంలో—ఇద్దరి మాటల్లోనూ సత్యమేదో గోచరించింది. కాని అప్పటికీ, ఇప్పటికీ అభియస్థంలో తన తండ్రినే బలపరుస్తోంది—కాకపోగా, సాంబమూర్తి కనబడ్డప్పుడల్లా ఏదో మృగం కనబడ్డట్లే భావిస్తోంది.

"నిజం! అది నిజం! అతడలాగే వుంటాడు!' అటూ, ఇటూ దొర్లసాగింది శారద. "తనకా జీవితం వద్దు—ఇరవై సంవత్సరాలకే ఆరుగురు పిల్లలతల్లి కాలేదు!"

తరువాత ఆమెకు తెలియకుండానే ఆమె రాత్రి రెండు గంటల సమయంలో నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది.

మరునాడుదయాన ఆఫీసులో కాలుపెడుతుండగానే ప్యూను చెప్పాడు: "మేనేజర్‌గారు పిలుస్తున్నారు!" అని.

శారద తలెత్తి, "లేటుగా వచ్చానా?" అనే అనుమానంతో గోడ గడియారం వంక చూచింది. ఇంకా పదికి పదినిముషాలుంది. ధైర్యంగా డ్రాయర్ తెరిచి, షార్టుహ్యాండ్ పుస్తకం, పెన్సిల్ తీసుకొని మేనేజర్ ఎయిర్ కండిషన్డ్ గదిలోకి తలుపు తీసుకొని కాలుపెట్టింది.

"గుడ్ మార్నింగ్ సర్!"

"గుడ్ మార్నింగ్!"

"డిక్టేషన్ ఇవ్వటానికే పిలిచారా సర్?"

"యస్..!"

శారద మెదలకుండా కూర్చొని, పేజీ తెరిచి, పెన్సిల్ పొజిషన్‌లో పెట్టుకుంది.

"మీరు ఇంతకంటే ముందుగా ఏదైనా ఆఫీసుకు రాగలుగుతారా?" అన్నాడు అతడు ఆమె ముఖంలోకి తదేకంగా చూస్తూ.

క్షణం తలెత్తి చటుక్కున వంచుకున్నది.

అతడి కళ్ళు వింతగా నవ్వుతున్నయి.

"యింట్లో ప్రతిపనీ నేనే చేయాలి!"

"మీ అమ్మగారు..?"

"ఆమె జబ్బుమనిషి!.. ఆమెకు ఎక్కువ విశ్రాంతి అవసరం అని డాక్టర్లు చెప్పారు.." అన్నది వంచిన తలనెత్తకుండానే.

"యస్..యస్.. గుర్తుకొచ్చింది... పోనీయండి ఫరవాలేదు..మీరు మామూలు టైంకే రాండి... నేనెలాగో అలాగా ఎడ్జస్టు చేసుకుంటాను!"

"థాంక్స్..!" అన్నది అతడి మంచితనానికి కృతజ్ఞతగా.

"మేనేజర్ ఎంత మంచివాడు?"

రెండునిముషాలు అలా మౌనంగా కూర్చొని, మేనేజర్ డిక్టేషన్ ఇవ్వకపోవడంతో చటుక్కున తలఎత్తింది.

అప్పటివరకూ, తదేకంగా తన మొఖంలోకి, చూస్తున్న అతడు కలవరపడుతున్నట్లుగా కళ్ళు రెపరెపలాడించి తలవంచుకొని, "యస్.. టేక్ డిస్!" అన్నాడు. అతడి కంఠంలో గూడా కలవరపాటు తొంగిచూచింది.

శారద అతడి మొఖంలోకి క్షణం చూచి తలవంచుకున్నది.

ఆరోజు ఇంటికి వెళ్ళేటంతవరకు అతడి కలవరపాటు చూపులే ఆమెను వెన్నాడినయ్.

అతడు ఎందుకలా చూచాడు?

ఆమెను వింతవింత ఆలోచనలు ఆవరించగా ఏ ఒక్క నిర్ణయానికీ రాలేకపోయింది!

ఇంట్లో కాలు పెట్టేటప్పటికి—ఏదో తెలియని గంభీరతతో ఇల్లంతా మునిగిపోయి వున్నట్లనిపించింది— తండ్రి మౌనంగా అటుతిరిగి పడుకొని వున్నాడు. తల్లి తలవంచుకొని మూలగా గోడ నానుకొని కూర్చొని వున్నది.

మొఖం కడుక్కు వచ్చింది.

"వాళ్ళు కబురు చేశారు!" అంది తల్లి.

వాళ్ళ మూగబాధకు అర్థం క్షణంలోనే స్ఫురించింది శారదకు. తేలిగ్గా నిట్టూర్పు విడిచింది.

"వాళ్ళు ఏం చెప్పారో గూడా నాకు తెలుసు!" అన్నది గంభీరంగా.

తెలుసు—అన్నా గూడా వూరుకోలేదు ఆమె. వివరాలన్నీ చెప్పింది.

కాని—

వాళ్ళు చెప్పిన విషయం—తను ఉద్యోగం చేయటమైతే అంగీకారమేగాని, ఆ డబ్బు తల్లిదండ్రులకు పంపటం ఇష్టంలేదు—అనేది, ఆమెను అమితంగా బాధించింది.

కొంతమంది మనుష్యుల మీద, వాళ్ళ మానవత్వం మీద ఏహ్యత జనించింది—"ఈ ప్రపంచంలో ఎందుకిలాంటి వ్యక్తులు వున్నారు?"

తను కాదంటే తన తల్లిదండ్రులు ఏమవాలి?

తల్లి అంటుంది: "మా తిప్పలు మేం ఏదో పడతాం..కట్నం తక్కువకే అంగీకరిస్తున్నారు..నీవు ఒప్పుకో తల్లీ!"

"నీవేమైనా చెప్పు..ఆ వ్యక్తిని నేను వివాహం చేసుకోలేనమ్మా!" అన్నది ఖండితంగా.

తల్లి మారు మాట్లాడలేదు. తండ్రి బలవంతాన ఒకసారి ఇటుతిరిగి కూతురు మొఖంలోకి దిగులుగా చూచి అటుతిరిగి పడుకున్నాడు.

మూడురోజుల తరువాత ఒక ఉదయం శారద ఆఫీసుకు వెళ్ళిన అరగంటకుగాని మేనేజర్ రాలేదు. వచ్చిన గంటకుగాని ఆమెను పిలువలేదు. అలా పిల్చిన తరువాత, ఆయన ఎదురుగా వెళ్ళి కూర్చున్న శారదకు తరువాత పావు గంటకుగాని డిక్టేషన్ ఇవ్వటం మొదలు పెట్టలేదు.

అదైనా—

మౌనంగా తలవంచుకు కూర్చున్న శారద మేనేజర్ ఎంతసేపటికీ డిక్టేషన్ మొదలు పెట్టకపోవటంతో అనాలోచితంగా తలఎత్తింది. అప్పటివరకు తన వంకే దీక్షగా చూస్తున్న అతడు, కనీసం తను చూస్తున్నదనైనా చూపు మరల్చుకొనకుండా ఇంకా అలాగే నవ్వుమొఖంతో చూస్తునే వున్నాడు!

శారద కలవరపడింది. కళ్ళు రెపరెప లాడించింది. మనస్సు పరిపరి విధాలపోయింది—"ఏమిటి అతగాడి వుద్దేశ్యం?"

"మీరు..మీరు.. డిక్టేషన్ ఇస్తారా?" అడిగింది లేచి నిలబడి తడబడుతూ.

మేనేజర్ ఉలిక్కిపడ్డాడు.

తలవంచుకొని, "యస్..యస్.. కూర్చోండి.. అర్జంట్ లెటర్స్ చాలా వున్నయి!" అన్నాడు.

శారద మౌనంగా కూర్చొన్నది— హృదయాన్ని అశాంతికి నిలయంగా చేసుకొని.

ఆరాత్రి పడుకొని కిటికీలో నుండి బయటకు ఎదురుగ్గా కనబడుతున్న సాంబమూర్తి మేడ వంక చూస్తూ అనుకున్నది—

"—తను డబ్బు కోసరం స్టెనోగా ఒకవ్యక్తి దగ్గర ఉద్యోగం చేస్తున్నది. తనకెలాగూ సుఖంలేదు. తన జీవితం ఇక ఎలాగూ చిగురించేదిలేదు.. అటు

వంటప్పుడు.. అదే డబ్బుకు, కాదంటే ఎక్కువ గూడా లభించవచ్చు— సాంబమూర్తి గృహంలోకి భార్య అనబడే ఆరుగురి పిల్లలతల్లికి ఆయాగా ఎందుకు వెళ్ళగూడదు?"

ఆ ప్రశ్న పొగమంచులా, ఆ ప్రదేశాన్నంతా ఆవరించి, ఒక్క సాంబమూర్తి తప్ప సర్వం అదృశ్యమయ్యేలా చేసింది.

అలాగే—కన్నార్పకుండా సాంబమూర్తి కళ్ళల్లోకి—దేన్నో తరచితరచి చూస్తున్నట్లుగా, లోతుకుపోయి వున్న కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయింది. అతడి నున్నటి బట్టతల మీద—అన్నీ వూడిపోగా, ఇక చేతగానితనమే మిగిలినట్లుగా వున్న సన్నటి నల్లటి వెంట్రుకల పాయను తన గుండెల్లో నేకు నొకదాన్ని దిగేసి—అటు, యిటు కదిలిస్తున్నట్లు కదిలిస్తున్నాడు. ఆయన ఆరుగురు పిల్లలకు తండ్రి అన్నట్లుగా వున్న ఆయన మొఖంమీదగనుడతలు—వంకర తిరిగిన నాగుల్లా మీది మీదికి వచ్చి భయంకరంగా కాటేస్తున్నాయి!

చటుక్కున కళ్ళు మూసుకుంది.

"అతడు మృగంలా కనబడుతున్నాడు— కాదు, మృగమే!"

బలంగా, గట్టిగా, కళ్ళు రెప్పలు పుస్తేలా మూసుకొని బిగుసుకు పడుకుంది.

నాలుగురోజుల తరువాత, ఒకరోజు ఉదయాన మేనేజర్ ఆఫీసుకు వస్తూనే, కాగితాలు తీసుకొని హడావుడిగా వెళ్ళిపోతూ, శారద సీటు దగ్గర ఒక్క క్షణం నిలబడి, "సాయంత్రం, బహుశ నేను వచ్చేటప్పటికి కొద్దిగా ఆలస్యమవ్వవచ్చు!.. ఆఫీసు టైం అయిపోయినాసరే మీరు వుండండి.. కొన్ని అర్జంటు కాగితాలు వున్నాయి!" అంటూనే వెళ్ళిపోయాడు.

మేనేజర్ అటు వెళ్ళగానే లేచి నిలబడిన అందరు తిరిగి కూర్చున్నారు. శారదా మెదలకుండా కూర్చుంది.

ఈరోజున సాయంత్రం ఇంటికి వెళ్ళి అమ్మను డాక్టర్ దగ్గరకు తీసుకు వెళదామనుకున్నది.

మేనేజర్ ఎన్నింటికి వస్తాడో ఏమో?

ఏం చేయాలో తోచలేదు!

ఏది ఏమైనా, మేనేజర్ మాటను త్రోసివేసి ఇంటికి వెళ్ళలేదు!

ఎన్నడూ మాట్లాడని తన సెక్షన్‌లోని పక్కసీటు శ్యామల, ఐదు గంటలకు, ఆఫీసు నుండి ఇంటికి వెళుతూ, శారద దగ్గరకు వచ్చి, "వెళ్దాం వస్తారా?" అన్నది.

"ఏనాడూ అలా అడగని ఆమె, ఈరోజున అడగటం వింత గొలిపినా, తేలిగ్గా తీసుకొని, "అదే ఆలోచిస్తున్నాను.. మేనేజర్‌గారేదో డిక్టేషన్ ఇస్తాను ఆలస్యమయినా ఆయన వచ్చిందాకా వుండమన్నారు.. మరి వెళితే కోపమొస్తుందేమో.. నాకా వేరే అర్జంట్ పని వున్నది!"

"అరె! అయామ్ సారీ!.. వుండండి.. విష్‌యూ ఏ హ్యాపీ ఈవెనింగ్!" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

ఆమె మాటలకు శారద మొఖం మసిపూసినట్లయింది.

శ్యామల ఉద్దేశ్యమేమిటి?

శారదకు ఒళ్ళంతా, తేళ్ళూ, జెర్రులు ప్రాకుతున్నట్లనిపించింది.

బాధతో, వేదనతో అలాగే కూర్చుండిపోయింది.

# మంచు కాలింది

ఆలోచనలు ఆమెను నలిపివేసినయి.

శ్యామల మాటలలోని అంతరార్థం గ్రహించినప్పుడు, మేనేజర్ ఆలోచనల వెనుక అంతరార్ధాంతం వున్నదేమో అనుకున్నప్పుడు భయంతో ఒడలు కంపించింది. మరుక్షణంలోనే అమితమైన కోపం వచ్చింది.

తరువాత చాలాసేపటికి ఆలోచనల నడుమ, ఉన్నట్లుండి కుర్చీలో నుండి లేచి వరండాలో కొచ్చింది.

చీకటిలో దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లను చూచి ఉలిక్కిపడి టైము చూచింది. ఏడు గంటలయింది. తడబడింది.

ఇంతసేపూ తనని తాను మరిచిపోయి ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ కూర్చున్నదా?

"ఇంకా మేనేజర్ రానేలేదు.. ఆయన వస్తాడో రాడో మరి!" అన్నట్లుగా గొణుక్కుంది.

"వెళ్ళాపోమా?"

వెళితే—వచ్చి విసుక్కుంటాడేమో?"

ఎంత అర్జంటు కాగితాలో మరి?

—అందునా ఇంతసేపూ వుండి మాట పోగొట్టుకున్నదవుతుంది!

వరండాలో నిలబడి రోడ్డు మీద పోతున్న కార్లను చూస్తూనే కొద్దినిముషాలు అలాగే గడిపివేసింది.

—క్షణంలో శ్యామల గుర్తుకు వచ్చింది. ఆమె మాటలు గుర్తుకు వచ్చినయి. ఆమె నవ్వు గుర్తుకొచ్చింది!

—తన మేనేజర్ అలాంటి వాడేగనుక అయితే తను ఇక్కడ నుండి ఎంత త్వరగా వెళితే అంత మంచిది!

"ఏమో బాబు! ఎవళ్ళు ఎలాంటి వాళ్ళో గూడా ఊహించుకోవటం కష్టమే!... అందునా ఆయన ఈమధ్య ప్రవర్తన..."

ఆయనకు కోపమొస్తే వచ్చింది తను వెళ్ళటమే మంచిదేమో?

తరువాత అనుకొని ఏం లాభం?

ఆలోచనా ద్వైదీభావంలా ఆమె ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. ప్రతిక్షణం పక్కసీటు శ్యామల మాటలే గుర్తుకొస్తున్నాయి.

పడుతున్న చమటను తుడుచుకొని, వెళ్ళటానికి ఉద్యుక్తురాలవుతున్నట్లుగా, "ముసలయ్యా!" అని పిలిచింది.

ప్యూను వచ్చాడు.

"అయ్యగారు వస్తే ఇప్పటిదాకా వుండి వెళ్ళానని చెప్పు!"

ఆఫీసు మెట్లు దిగి బస్సుస్టాండు వైపుకు నడిచింది.

తడబడుతూనే ఇంటికి చేరింది.

ఇంట్లో కాలుపెడుతూనే కనబడిన దృశ్యం ఆమెను మరింత కృంగదీసింది. మంచం మీద పడుకొని వున్న తల్లిని డాక్టర్ వంగి పరీక్షిస్తున్నాడు. ఎదురింటి సాంబమూర్తి వాకిటి దగ్గర నిలబడి వాళ్ళ వంకే చూస్తున్నాడు. శారద చిన్నగా దగ్గింది—తన రాకను తెలియబరుస్తూ!

సాంబమూర్తి వెనుదిరిగాడు.

చిన్నగా గొంతు సవరించుకొని, "అమ్మకు గుండె నొప్పివచ్చి గిలగిల లాడుతుంటే డాక్టర్ను పిలుచుకు వచ్చాను!" అన్నాడు.

శారద ఏ భావమూ వ్యక్తం చేయకుండానే వెళ్ళి తల్లి తల ప్రక్కగా తలవంచుకు నిలబడింది.

ఆమె డాక్టర్ ఇస్తున్న ఇంజక్షన్‌కు చిన్నగా కదిలింది.

తరువాత ఐదు నిముషాలకు డాక్టర్ బయటకు వెళుతూ, చీటీ మీద మందులు వ్రాసిఇచ్చి, తెప్పించి వాడమన్నాడు.

శారద ఆ చీటి తీసుకున్నది.

డాక్టర్ వెళ్ళిపోయాడు.

సాంబమూర్తి గూడా వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ, "డబ్బేమైనా కావాలా?" అడిగాడు చిన్నగా.

"వద్దు!"

అతడు వాకిలి వైపు అడుగులు వేస్తున్నాడు.

ఒక్కక్షణం ఆపి, తను లేనిసమయంలో, అతడు చేసిన సహాయానికి కృతజ్ఞత తెలియబరచాలనిపించింది. ఒక్కఅడుగు ముందుకు వేసింది.

అతడే అనుకోకుండా ఆగిపోయాడు.

నెమ్మదిగా వెనుదిరిగాడు.

నాలుగడుగులు శారద వైపుగా వేసి, "వాళ్ళు పెద్దవాళ్ళు. వాళ్ళకు అర్థంగాదు.. చిన్నదానివి, నీవైనా అర్థం చేసుకొని, నేను మీ నాన్నను కోరిన విషయాన్ని తిరిగి ఆలోచించలేవా శారదా?" అన్నాడు.

తన పేరును, రంపంపెట్టి కోసి, విడివిడిగా ముక్కలు చేసి, పిలిచినట్లనిపించింది శారదకు. వంటినిండా నిప్పులు కురిపించి, చిన్నగా విసురుతున్నట్లుగా పండ్లు బయటకు పెట్టి నవ్వుతున్నాడు.

అంతవరకు సాంబమూర్తి మీద లీలగా కృతజ్ఞత పేర్చుకుంటున్న కళ్ళు ఒక్కసారిగా ద్వేషంతోనూ, భయంతోనూ కప్పివేయబడ్డాయి.

"మనిషి స్వార్థం లేకుండా ఏ పని ఎందుకు చేయడు? చేయలేడు?"

విసురుగా అటు, యిటూ కదిలింది. "మంచిది!



వెళ్ళిరరండి!" తలుపులు భళ్ళున వేసుకొని లోపలి కొచ్చింది.

తల్లి తల దగ్గిర, తన తలపెట్టుకొని, ఆమె గుండెల మీద చేయిచేసి, "అమ్మా!" అని బావురు మున్నది.

మరునాడు బిక్కుబిక్కుమంటూనే ఆఫీసుకు వెళ్ళింది.

రాత్రి ఎన్ని గంటలకు వచ్చాడో మేనేజర్?

వచ్చి ఏమన్నాడో?

అనుమానిస్తున్నట్లే— ఆఫీసులో కాలు పెడు తుండగానే పిలుపు వచ్చింది!

తడబడుతూ, పుస్తకం పెన్సిల్ తీసుకొని ఎయిర్ కండిషన్డ్ గదిలో కాలుపెట్టింది.

"కూర్చోండి!" ఫైళ్ళు చూస్తూనే ఆమె రాకను గమనించి అన్నాడు మేనేజరు.

"రాత్రి..రాత్రి.. వెళ్ళక తప్పలేదు.. అప్పటికే చాలాసేపు.." కంఠం వణికింది.

అతడు తలెత్తాడు. "క్షమించాలి.. రాత్రి పొర పాటు జరిగింది. నేను పెందరాళే రాలేకపోయాను... మీరు మంచిపని చేశారు!" అన్నాడు.

ఆమె మనస్సు ఎంతో తేలికపడింది.

కూర్చుంటూ, "డిక్టేషన్ ఇస్తారా సార్!" అడి గింది తలెత్తి.

"ఇస్తాను!" అతడు తలవంచుకోలేదు. శారద ఆశ్చర్యపోయేలా, ఆమె వంకే కన్నార్పకుండా చూస్తూ,

# మంచు కాలింది

"దీన్ని ఒక విధంగా డిక్టేషన్ అనవచ్చు.. కాని మీరు వ్రాసుకోనక్కరలేదు.. శారదాదేవి! నన్ను అపార్థం చేసుకోవద్దు! నేనొక సమస్యతో బాధ పడుతున్నాను. రాత్రి నాకు అసలు నిద్రేలేదు. ఇక మీ తీర్పు మీద మిగతా రాత్రుల నిద్ర గూడా ఆధారపడి వుంటుంది!" అన్నాడు.

అతడి మాటలకు ఆమె బిత్తరపోయింది.

అతడు ఒక్కక్షణం, తటపటాయిస్తున్నట్లుగా ఆగి, "నేను ఈ విషయంలో అనవసరపు ఉపోద్ఘాతా లివ్వదలచుకోలేదు.. డొంకతిరుగుడుగా చెప్పాలనేది నా అభిమతంగాదు.." గొణిగాడు.

శారదకు అతడి ధోరణి చికాకు కలిగించింది. మొఖం ఎర్రబడిపోగా అతడి వంకే సర్వం మరచి చూడసాగింది.

"ఈ కంపెనీకి నేను మేనేజర్ని.. అంతేగాదు, కంపెనీలో ఎక్కువ భాగంషేర్లు నావే!.. ఎవ్వరూలేని నేనే ఈ ఆస్తి కంతటికీ పెద్దను!" కంఠం నుంచి మాటలు బాధను పెనవైచుకొని బయటకు దొర్లాయి.

శారదకు శరీరమంతా చెమటలు పట్టసాగింది. ఉక్కిరిబిక్కిరి అయింది. లేచి ఎక్కడికో—మను ష్యులు లేని ప్రదేశంలోకి పారిపోదామన్నంత తహ తహతో ముళ్ళ మీద కూర్చున్నట్లుగా కూర్చున్నది.

"ఇంటర్వ్యూలో మిమ్మల్ని చూసిన రోజుననే ఏదో తెలియని ఇష్టత మీమీద ఏర్పడింది.. అంత దాకా ఎందుకు.. అవన్నీ ఎందుకు..నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను. మీకు అంగీకారమేనా?" ఆశతో గూడిన తహతహతో ఆమె మొఖంలోకి చూడ సాగాడు.

శారద మరుగుతున్న నీళ్ళతో కుతకుతలాడు తున్నట్లుగా, బాధతోనూ, భయంతోనూ అతడి వంక కండ్లప్పగించి చూడసాగింది.

అతడే మంటున్నాడు?

ఆశ్చర్యంతో కొయ్యబారిపోయింది!

"దీనిలో బలవంతం ఏమీలేదు శారదాదేవి!... మీకు హృదయపూర్వకంగా సమ్మతమైతేనే అంగీక రించవచ్చు.. దీనిలో ఉద్యోగపు హోదా ప్రశక్తే లేదు.. మీరు అంగీకరించకపోయినా, ఉద్యోగరీత్యా మీ మీద"... అతడు చెప్పుకుపోతున్నాడు.

"నా పరిస్థితి వేరు!.." నోరు పెగల్చుకొని నంగి నంగిగా అన్నది.

"ఆ పరిస్థితులేమిటో నాకు తెలుసు.. ఎవ్వరూ లేని నేను.. మీ అమ్మనూ, నాన్ననూ, నా తల్లి దండ్రుల కన్నా మిన్నగా చూచుకుంటాను!.." కళ్ళు కాంతితో తళతళ లాడుతున్నాయి. "మీరు అంగీకరించకపోవటానికి అదే కారణమైతే.."

"నా పరిస్థితులన్నీ ఏంతెలుసని..?" గంభీరంగా, చాలా పెద్దదానిలా, అన్నీ తెలిసిన దానిలా అడిగింది.

ఆమె హృదయం దుర్బలత్వాన్ని, భయాన్ని బాధని పోగొట్టుకున్నది.

ఆమె సర్వం జయించిన దానిలా నిండుగా కూర్చు న్నది.

అతడు చటుక్కున డ్రాయరులాగి ఒక కాగితం బయటకు తీశాడు.

"మీకు ప్రభాకరం తెలుసు గదూ?"

"ఏ ప్రభాకరం?" వింతగా అడిగింది.

"గుంటూరు!.. ఈ ఉత్తరం చదవండి మీకు తెలుస్తుంది. అంతేగాదు, మీ గురించిన సర్వస్వం నాకెలా తెలిసిందో మీకు తెలుస్తుంది..!" అన్నాడు. అతడి కళ్ళు నవ్వుతూనే వున్నాయి.

శారద ఆ నవ్వును జయిస్తోంది చిన్నచిన్నగా. చేయి జాపి అందుకున్నది.

"రాజశేఖరంగారూ!

నేనెవరో మీకు బాగా తెలియకపోయినా, కొద్ది కొద్దిగా గుర్తు వుండే వుండవచ్చు..నేను మీ ఆత్మ మిత్రుడు నిరంజనం కజిన్ని.. ఒకటిరెండుసార్లు వారింట్లో నన్ను చూశారు మీరు. పరిచయాలకేం లెండి. అసలు విషయంలోకి వస్తాను.

ఈమధ్య శారద మీ వద్ద స్టెనోగాజేరినట్లు తెలిసింది. ఆమే నేను ఈ జాబు వ్రాయటానికి కారణం! కొన్నిరోజుల క్రితం నేను ఆమెను నాలైఫ్ పార్ట్నర్‌గా ఎన్నుకునేందుకుగాను చూడటానికి ఆమె ఇంటికి వెళ్ళాను. అప్పటికి ఆమె ఉద్యోగంలో చేరలేదు.

ఆమె నాకు నచ్చింది. కాని, ఆమె ఎంతో ధైర్యంతో చెప్పిన మాటలు మాత్రం, మా వాళ్ళకు నచ్చలేదు..ఏ ఆధారమూలేని తల్లిదండ్రులను పోషించేందుకుగాను, తను ఉద్యోగం చేస్తూ, జీతంలో ఎక్కువభాగం వాళ్ళకు పంపుతానన్నది. అందుచే


లాభదాయకం అధునాతనం అయిన చిన్నతరహా కుటీర పరిశ్రమ
కొద్ది పెట్టుబడితో ప్రారంభించండి.

కొద్ది పెట్టుబడితో పూర్తికాలికంగా కాని, సహాయ పరిశ్రమగా కాని, లఘు పరిశ్రమ ప్రారం భించ దలచుకున్నవారు "ఆధునాతన కుటీర పరిశ్రమలు" అన్న తెలుగు గ్రంధాన్ని (రెండవ ముద్రణ) చదవాలి. లాభదాయకమైన చిన్నతరహా పరిశ్రమలగూర్చి, ముడిపదార్థాలు దొరుకు చోట్లు, యంత్రాలను వాయిదాల పద్ధతిని తెప్పించుకోవడం, లఘు పరిశ్రమలకు ప్రభుత్వ సహాయం వగైరా యెన్నో విషయాలు దీనిలో వున్నాయి. 960 పుటలు; 350 బొమ్మలు; గుడ్డ బైండ్ ప్రతి ధర రూ. 15-50; తపాలఖర్చు రూ. 1-85. ఇతర ప్రతులు: ఇంగ్లీష్, మరాఠి రూ. 15-50; హిందీ రూ. 14-50; గుజరాతీ, మలయాళం, తమిళం, కన్నడం రూ. 13-00
COTTAGE INDUSTRY (ANW-58) P. B. 1262, Behind Recruiting Office, Near RedFort, Jamuna Rd, Delhi-6 T'phone: 262835



నకిలీలు చూసి మోసపోవద్దు
దర్‌బార్ కాజల్ (రిజిస్టర్డు)

కండ్ల అందానికి
రక్షణరు
రాంబీర్ కంపెనీ, బొంబాయి-4 BR.
దర్‌బార్ గంధ్ మరియు కాజల్ తయారుచేయువారు.

అంగీకారమయినట్లయితేనే వివాహం చేసుకుంటా నన్నది!

ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె కళ్ళల్లో కనిపించిన సిన్సియారిటీ నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నేను చలించిపోయాను. ఈ కాలంలో ఎంతమంది ఆమె లాంటి నిర్ణయాలు చేసుకోగలుగుతారు?

ఉహూ..

ఆమె కోరికను నేను కాదనలేకపోయాను. కాక పోగా, ఆమెను అభినందించి, మరింత ప్రోత్సహించాలని గూడా అనుకున్నాను. కానీ ఏమీ చేయలేక పోయాను. అది నా బలహీనత. పెద్దవాళ్ళకు ఎదురు తిరగలేకపోయాను. అందుకనే అలాంటి వ్యక్తిని నా అర్ధాంగిగా పొందే అదృష్టం నాకు లేకపోయింది!

మా పెద్దవాళ్ళని చెప్పి వాళ్ళ భావాలను దాచి పెట్టాల్సిన అవసరం నాకు లేదు. వాళ్ళకు ఆమె ఉద్యోగం చేయటమైతే ఇష్టమేగాని, ఆ డబ్బును ఆమె తల్లిదండ్రులకు పంపటం ఏమాత్రం ఇష్టం లేదు.. ఇదెక్కడి ప్రపంచం!

అందుకే—

నేను కోరేదల్లా—మా మిత్రుడి కజిన్‌గా—ఆమెకు ఉద్యోగంలో మీరు చేయగల సహాయం చేయండి!.. అంత మంచి వ్యక్తులుండటం ఈ ప్రపంచంలో చాలా అరుదు!

ఆమెకు నా శుభాశీస్సులు అందజేయండి.

ఉంటా—

—ప్రభాకరం"

ఆ ఉత్తరం ఆమెను కదిలించివేసింది. ఆమె కళ్ళు ప్రభాకరం మీదగల కృతజ్ఞతతో, ముత్యాలలా వున్న అతడి అక్షరాల వంకే రెప్పలార్పకుండా చూడ సాగినయి.

"ఇప్పటికయినా చెప్పండి.. మీ వూహల్ని నేను అర్థం చేసుకున్నట్టేనా?"

ఏదో గాలిలో తేలిపోతున్నట్లుగా చిన్నగా తల వూపింది. "నాకు కొద్దిగా టైం కావాలి..!" అంది తలెత్తి.

"తప్పకుండా.. మీ వాళ్ళను అడిగే మీ అంగీకారం తెలియబరచవచ్చు!"

రాజశేఖరం బజ్జర్ నొక్కాడు.

ప్యూను వచ్చాడు.

"రెండు ఆరెంజి!"

ఇద్దరూ మౌనంగా—మనుష్యులులేని ప్రపంచంలో వున్నంత మౌనంగా—ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ కూర్చుండిపోయారు. ఎవరి ఆలోచనలు వారివి.

ఆరెంజి గ్లాసులు వచ్చినయి. ఒకటి శారద ముందుకు తోస్తూ, "తీసుకోండి!" అన్నాడు రాజశేఖరం.

ఆమె దానిని అందుకోకుండానే, "నేనిలాగే ఉద్యోగం చేయటం మీ కిష్టమేనా?" చాలా బరువుగా అడిగింది.

"నా కెలాంటి అభ్యంతరమూ లేదు.. నేనేదో పేడి మీద చెబుతున్న మాటలు కావివి.. నేను హృదయ పూర్వకంగా చెబుతున్నాను!" అన్నాడు ముందుకు వంగి.

"మరి నా జీతం..?" గొణుగుతున్నట్లుగా అన్నది.

"మనమంతా ఒకచోటే వుంటున్నప్పుడు... అయినా మీ యిష్టం.. మీ యిష్టం!" అన్నాడు తడబడుతూ.

"సరే..నా నిర్ణయం రేపు చెబుతాను!"

చేతిలోకి ఆరెంజి గ్లాసును తీసుకొని—మంచులా చల్లగా వున్న ఆ ద్రవపదార్థాన్ని—గడగడా త్రాగేసింది. మరుక్షణంలోనే ఆ ఎయిర్ కండిషన్డ్ గదిలో, ఆమె శరీరం ఆమెకు తెలియకుండానే, మంచులా చల్లగా మారిపోతూ—గడ్డకట్టు కట్టుకపోతున్నదే మోననిపించసాగింది.. ఆమె మరేదో లోకంలో కాలు పెట్టింది. ఆమెకు సర్వం క్రొత్తగా కనబడగా, ఏమీ తెలియని అయోమయావస్థలో పడిపోయింది.

"రేపటిదాకా దేనికి?.. ఇప్పుడే ఇద్దరం వెళ్ళి, మీ తల్లిదండ్రుల నడిగి, వాళ్ళ ఆశీర్వాదం పొందుతాం!"

ఆమె ఆ మత్తు నుండి కోలుకోకుండానే, "సరే పదండి!" అన్నది.

కారు పెంకుటింటి ముందు ఆగింది.

మంచుబొమ్మలా ముందుకు అడుగువేస్తూ, గడప దాటి లోపల కాలు పెడుతున్నదల్లా ఒక్క క్షణమాగి పక్కన మేడ మీద కూర్చున్న సాంబమూర్తి వంక చూచింది.

అక్కడ, యాభై ఏళ్ళ సాంబమూర్తి, తన లోతైన కళ్ళతో, దిగులుగా దీనంగా తన వంకే చూస్తున్నాడు. అతడి నున్నటి బట్టతల మీద—ఉన్నవన్నీ వూడిపోగా ఇక చేతగానితనమే మిగిలి వున్నట్లుగా వున్న సన్నటి వెంట్రుకల పాయను వేలితో అటూ, యిటూ—తన మీద తనే, తనకు తెలియని భూతాన్ని రుద్దుకుంటున్నట్లుగా కదిలిస్తున్నాడు. అతడు ఆరుగురు పిల్లలకు తండ్రి అన్నట్లుగా వున్న నుదుటి మీది ముడతలు అతడి చుట్టూ భయంకరమైన వలపన్ని, అతడి మొఖాన్ని నలిపి వేస్తున్నట్లుగా వున్నాయి.

జాలిగా అతడి మొఖంలోకి ఒక్కసారి చూచి లోపలికి వచ్చింది.

రాజశేఖరం అనుసరించాడు.

"అమ్మా!" తడబడుతూ పిలిచింది. "నాన్నా!" లోపల కాలు పెట్టింది.

అక్కడి దృశ్యం చూస్తూనే పిచ్చిదానిలా, పెద్దగా ఒక్క కేక వేసి కుప్పలా, మంచుముద్దలా కూలబడి పోయేలోగానే, నాలుగడుగులు వెనుక వున్న రాజశేఖరం ముందుకు దూకి ఆమెను రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకున్నాడు.

"అమ్మా! నాన్నా!" గింజుకుంటున్నది ఆమె.

నీళ్ళతో తడిసి, ముద్దయి వున్న ఆమె శరీరాన్ని అదిమి పట్టుకున్నాడు.

అక్కడి దృశ్యం అతడిని కుదిపివేసింది.

ఆమె తల్లిదండ్రు లిద్దరూ అక్కడ అచేతనంగా పడివున్నారు. అప్పటికి కొన్నిగంటల క్రితం—వాళ్ళు మరణించినట్లుగా వున్నారు!

అతడి దృష్టి అకస్మాత్తుగా వాళ్ళ తలవైపు వున్న కాగితం మీదపడి వున్నది.

రాజశేఖరం ఆమెను అలా ఒకచేత్తో పట్టుకునే, కొద్దిగా జరిగి, వంగి ఆ కాగితాన్ని అందుకున్నాడు.

"నీ జీవిత సౌఖ్యానికి మేం ఎన్నాళ్ళు అడకత్తెర్లుగా వుండగలం? మాకు సుఖంలేదు. మా జీవితమూ అయిపోయింది. అటువంటప్పుడు—నీ—నీ సుఖాన్ని, జీవితాన్ని రంగరించి మేమెందుకు త్రాగివేయాలి?.. అందుకనే నీభావిజీవితానికైనా, సుఖాన్ని సంతోషాన్ని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ, నిన్ను దీవిస్తూ—"

రాజశేఖరం జారిపోతున్న ఆమెను మరింత గట్టిగా, పడిపోకుండా పెనవేసుకు నిలబడ్డాడు.

ఆమె ఒళ్ళు వెచ్చగా ఆవిర్లు తేలుతుంది! ●

